7

సాక్షి విశాఖపట్నం

శనివారం । 8 । ఫిబ్రవరి । 2025

నువ్వే బలం..బలగం





యువతకు స్ఫూర్తి , మార్గ నిర్దేశకుడు స్వామి వివేకానందుడు. ఆయన మాటలు తరతరాలకు వన్నె తరగని స్ఫూర్తి మంత్రాలు. ఆయన అడుగులు యువతకు నిత్య చైతన్యాన్ని నింపే అస్త్రాలు. ఆయన ఇచ్చిన ప్రతీ సందేశం ప్రతికూల ఆలోచనల్ని దూరం చేసి ధైర్యాన్ని నింపుతుంది. యువతకు బలం..బలగం ఆయనే.. వివేకానంద జయంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం శోభయాత్ర నిర్వహించారు.

- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

8లో

శ్రీవారికి నృత్య నీరాజనం



పెదగంట్యాడలో వినాయకనగర్ వుడా కాలనీలోని పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా చిన్నారుల శ్రీనివాస కల్యాణం నృత్య ప్రదర్శన విశేషంగా అలరించింది. - పెదగంట్యాడ

సిటీకి స్నోగసు

పోర్టు స్టేడియంలో 'స్నో స్టేషన్' పేరుతో సరికొత్త మంచు వినోద కేంద్రం రూపుదిద్దుకుంది. దేశంలో కొన్ని నగరాల్లో ఇలాంటి కేంద్రాలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలో మాత్రం ఇదే మొదటిది కావడం విశేషం. ప్రారంభ కార్యక్రమంలో చిన్నారులు సందడి చేశారు.

- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

8లో



న్యూస్‌రీల్

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం



గృహ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాబాబు

తగరపువలస: ప్రభుత్వం తరపున చేపడుతున్న గృహ నిర్మాణ సముదాయాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.రాజాబాబు అన్నారు. శుక్రవారం ఆయన ఆనందపురం మండలంలోని ఎన్‌జీఆర్ పురం, గిడిజాల–3, తంగుడుబిల్లిలో గృహ నిర్మాణ సముదాయాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. నాణ్యత పాటించి అన్ని వసతులు సమకూర్చాలన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఎస్‌ఈ జయరామాచారి, పీడీ సత్తిబాబు, ఈఈ శ్రీనివాసరావు, డీఈఈలు సూర్యారావు, రామకృష్ణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లలో సౌకర్యాలపై ఆరా




డీడీ శ్రీదేవి, ఇతర అధికారులతో చర్చిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: జిల్లా బీసీ సంక్షేమశాఖ కార్యాలయాన్ని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. జిల్లా పర్యటనలో ఉన్న ఆయన తొలుత పెందుర్తిలోని బీసీ బాలురు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. హాస్టల్‌లో సౌకర్యాలతో పాటు విద్యాబోధనకు సంబంధించిన పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంవీపీ కాలనీలోని సంస్థ కార్యాలయానికి వచ్చి లబ్ధిదారులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. ఎంవీపీ సర్కిల్ దరి బీసీ స్టడీ సర్కిల్‌లో సంస్థ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలపై ఆరా తీశారు. జిల్లా బీసీ సంక్షేమశాఖ, బీసీ కార్పొరేషన్ విభాగాల ఉద్యోగులు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ డీడీ శ్రీదేవి, మాజీ డీడీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారతమాలకు బైబై..!

వైజాగ్ పోర్టుకు షాకిచ్చిన కేంద్ర ప్రభుత్వం



కుడిచేత్తో ఇచ్చి.. ఎడం చేత్తో లాక్కున్నట్లుగా ఉంది కేంద్ర ప్రభుత్వ వ్యవహారం. ఓవైపు ఇవ్వాల్సిన నిధులను ఎవరికీ కనిపించకుండా భారీగా కన్నం పెట్టేసి.. మరోవైపు అందరికీ తెలిసేలా పప్పుబెల్లాలు విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) చేతిలో పెట్టింది. మొత్తానికి పోర్టు ఎన్నో ఆశలు పెట్టుకున్న భారతమాల ప్రాజెక్టు నిధులకు మంగళం పాడేసింది. ఏకంగా దాదాపు రూ.1200 కోట్లు విలువ చేసే పనులను ప్రాజెక్టు నుంచి తొలగించేసింది. దీంతో ఈ భారాన్ని పోర్టు భరించేందుకు ముక్కుతూ మూలుగుతూ సిద్ధమవుతోంది.

– సాక్షి, విశాఖపట్నం

- నాలుగు ప్రాజెక్టులను భారతమాల నుంచి తొలగింపు
- మొత్తం రూ.1200 కోట్ల ప్రాజెక్టుల భారం పోర్టుపైనే
- భారాన్ని తగ్గించేందుకు ఆర్‌వీఎన్‌ఎల్‌తో ప్రాజెక్టుల నిర్మాణానికి ఒప్పందం
- 48, 52 శాతం వాటాలతో నిర్మించేందుకు అంగీకారం

ఇటీవల.. సరకు రవాణా, ట్రాఫిక్ నిర్వహణలో సత్వర పరిష్కారానికి పోర్టు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్)తో రూ.300 కోట్ల ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా సీ–హార్స్ జంక్షన్ నుంచి డాక్ ఏరియా వరకు ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్న 11 లెవెల్ క్రాసింగ్‌లను తొలగించి, సరకు రవాణాను సాఫీగా కొనసాగించడానికి ఈ ఫ్లైఓవర్ నిర్మాణం సాగనుంది. 3.341 కిలోమీటర్ల పొడవుతో 7 మీటర్ల వెడల్పుతో డబుల్ లైన్లు, 10 మీటర్ల వెడల్పుతో ట్రిపుల్ లైన్లతో ఫ్లైఓవర్ నిర్మిస్తారు. వాస్తవానికి ఇది భారతమాల ప్రాజెక్టు. కానీ కేంద్ర ప్రభుత్వం చివరి నిమిషంలో చేతులెత్తెయ్యడంతో ఏం చెయ్యాలో పాలుపోక పోర్టు ఆర్‌వీఎన్‌ఎల్‌లో ఒప్పందం చేసుకుంది. ఇదే కాదు మరో మూడు ప్రాజెక్టులకు సంబంధించిన నిధులను కూడా ఇచ్చేది లేదని కేంద్ర ప్రభుత్వం కుండబద్దలు కొట్టింది.

భారమంతా పోర్టుపైనే


పోర్టులకు సంబంధించి సముద్రంలో బెర్తుల అభివృద్ధితో పాటు అంతర్జాతీయ సాగర జల వివాదాలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం 'సాగర మాల' ప్రాజెక్టును ప్రారంభించగా.. భూ భాగంలో సమస్యల పరిష్కారానికి 'భారతమాల' ప్రాజెక్టును అమలు చేస్తోంది. సాగరమాల కింద పోర్టు పరిధిలో రూ.వందల కోట్ల పనులు జరుగుతున్నాయి. ఇదే మాదిరిగా భావించి సరకు రవాణా అభివృద్ధికి ఫ్లైఓవర్లతో పాటు, రహదారుల నిర్మాణ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రణాళికలను అధికారులు సిద్ధం చేశారు. అవుటర్ హార్బర్ ఏరియా నుంచి సీ హార్స్ జంక్షన్ వరకూ, సీ హార్స్ జంక్షన్ నుంచి డాక్ ఏరియా వరకూ ఫ్లైఓ



ఆర్‌వీఎన్‌ఎల్‌తో ఒప్పందం కుదర్చుకుంటున్న పోర్టు అధికారులు (ఫైల్)

వర్లు, పోర్టు నుంచి షీలానగర్ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును విస్తరించి ఆరు వరుసలు చేయడం, అనకాపల్లి నుంచి ఆనందపురం వరకూ ఉన్న రహదారికి షీలానగర్ రోడ్‌ని అనుసంధానించే ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. ఒక్కో ప్రాజెక్టు రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకూ అంచనా వ్యయంతో పాటు డీపీఆర్‌లు రూపొందించారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌లను కేంద్ర జలవనరులు, షిప్పింగ్, పోర్టుల మంత్రిత్వ శాఖకు దాదాపు రెండేళ్ల క్రితం పంపించారు. వీటన్నింటినీ భారత మాల ప్రాజెక్టుకిందకు తీసుకొస్తామని తొలుత కేంద్రం హామీ ఇచ్చింది. అప్పటి నుంచి పలుమార్లు ఈ ప్రాజెక్టుల గురించి సంబంధిత మంత్రిత్వ శాఖకు విన్నవించేవారు. త్వరలోనే ఆమోదముద్ర వేస్తామని సమాధానమిచ్చిన కేంద్ర ప్రభుత్వం.. ఇటీవల పోర్టుకు షాకిచ్చింది. ఈ ప్రాజెక్టులకు నిధులను తమరే సమకూర్చుకోవాలని భారత మాల నుంచి రూపాయి కూడా ఇచ్చే అవకాశం లేదని చావుకబురు చల్లగా చెప్పింది. దీంతో ఏం చెయ్యాలో పాలుపోక ప్రాజెక్టుల అమలుపై పోర్టు అధికారులు సందిగ్ధంలో పడ్డారు.

చివరికి 52 శాతం భారంతో ఒప్పందాలు



పోర్టు నిర్మించబోయే ఫ్లైఓవర్ నమూనా

ఈ ప్రాజెక్టుల మొత్తం భారం పోర్టుపైనే పడనుంది. సొంతంగా ప్రాజెక్టులు నిర్వహిస్తే మరింత భారం పెరిగే అవకాశం ఉండటంతో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆర్‌వీఎన్‌ఎల్‌ని పోర్టు అధికారులు సంప్రదించారు. తొలి ప్రాజెక్టుపై ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి 52 శాతం నిధులు పోర్టు భరించాల్సి ఉంటుంది. 48 శాతం ఆర్‌వీఎన్‌ఎల్ ఖర్చు చేస్తుంది. ఇది పూర్తయిన తర్వాతే మిగిలిన ప్రాజెక్టుల జోలికి వెళ్లాలని.. ఈలోగా కేంద్రం సాయమేదైనా చేస్తుందా.. లేదా భారత మాలలో తిరిగి కొన్ని ప్రాజెక్టుల్ని పెట్టే అవకాశం ఉంటుందా అని పోర్టు అధికారులు ఆశిస్తున్నారు. మరోవైపు ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.730 కోట్లు పోర్టుకు కేటాయిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. అయితే ఈ నిధుల్లో సింహభాగం గతంలో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించినవే తప్ప కొత్తగా మంజూరు చేసింది స్వల్ప మొత్తమేనని పోర్టు వర్గాలు చెబుతున్నాయి. భారత మాలలో ప్రాజెక్టులను చేర్చకపోతే పోర్టు ఆర్థికంగా కొంత మేర నష్టపోయే అవకాశాలున్నాయని, మరోసారి దీనిపై పునరాలోచించుకోవాలని పోర్టు అధికారులు మంత్రుల్ని కోరుతున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న ఇంటర్‌మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి మురళీధర్

సీతంపేట: ఇంటర్‌మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇంటర్‌మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.మురళీధర్ అన్నారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై స్థానిక బీవీకే కళాశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు రెండు విడతల్లో జరగనున్న ప్రాక్టికల్స్ పరీక్షల్లో ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా సజావుగా నిర్వహించాలని కోరారు. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్స్ ఆర్డర్స్ శనివారం కళాశాలల లాగిన్‌లో అప్లోడ్ చేస్తామని తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ అందరూ తమ లాగిన్స్ ద్వారా ఆర్డర్స్ డౌన్‌లోడ్ చేసి సంబంధిత ఎగ్జామినర్స్‌కు అందజేయాలన్నారు. జిల్లాలో మొదటి విడతలో 146 సెంటర్లలో ఎంపీసీ 29,791 మంది, బైపీసీ 4,888 మంది ప్రాక్టికల్స్‌కు హాజరవుతారని తెలిపారు. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ కళాశాల ముందు కళాశాల కోడ్ , కళాశాల పూర్తి చిరునామాతో కూడిన నేమ్ బోర్డు ఏర్పాటు చెయ్యాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రాధ, బీవీకే కళాశాల ప్రిన్సిపాల్, డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీసభ్యులు, ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూ నివారణకు చర్యలు

మహారాణిపేట: జిల్లాలో మలేరియా, డెంగ్యూ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణ, నియంత్రణ సమన్వయ కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నేవీ నిషేధిత ప్రాంతాల్లో, క్వార్టర్స్‌ల్లో ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రే చేసేందుకు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని నేవి అధికారులకు సూచించారు. రాష్ట్ర సీఎస్సార్ నిధుల నుంచి జిల్లాకు కేటాయించిన 8 ఫాగింగ్ మిషన్లను కలెక్టర్ ప్రారంభించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా మలేరియా నివారణాధికారి తులసీ రాజ్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ జి.పూర్ణేంద్రబాబు, డీఆర్‌డీఏ, సోషల్ వెల్ఫేర్, నేవి, పోర్టు, స్టీల్ ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు.

16న పింక్ సఖి శారీ వాక్

ఏయూక్యాంపస్: మహిళల్లో బ్రెస్ట్ కాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ఈ నెల 16వ తేదీన బీచ్‌రోడ్డులో పింక్ సఖి శారీ వాక్ నిర్వహిస్తున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శుక్రవారం బీచ్‌రోడ్డులో ఓ హోటల్‌లో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు అధికంగా రొమ్ము క్యాన్సర్ భారిన పడుతున్నారని, అవగాహనతతో క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్సను అందించాల్సిన అవసరం ఉందన్నారు. గురుద్వార సత్ సంగత్ అధ్యక్షుడు డాక్టర్ డీఎస్ ఆనంద్ మాట్లాడుతూ ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించే విధంగా రాష్ట్రంలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఫిట్‌విత్ ఫ్యాట్ వ్యవస్థాపకురాలు, క్యాన్సర్‌ను జయించిన ఫర్జానా బేగం మాట్లాడుతూ తాను స్వయంగా క్యాన్సర్‌తో బాధపడ్డానని చికిత్స ద్వారా కోలుకున్నానని వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌సీజీ కాన్సర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఆదిత్య, రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ ఉపాధ్యక్షురాలు మీనాక్షి అనంతరామ్, గుర్మీత్ కోహ్లీ తదితరులు ప్రసంగించారు. రోహిత్ మెమోరియల్ ట్రస్ట్, రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ ఇండియా సంయుక్తంగా ఫిబ్రవరి 16న ఉదయం 6 గంటలకు విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్దన పింక్ సఖి వాక్ ప్రారంభమవుతుందన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

టాటా–యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: కాజీపేట–విజయవాడ సెక్షన్ పరిధి ఖమ్మంలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే టాటానగర్–యశ్వంత్‌పూర్–టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 13న టాటానగర్–యశ్వంత్‌పూర్(18111) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 9,16న యశ్వంత్‌పూర్–టాటానగర్ (18112) ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు

మహారాణిపేట: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను శక్తి వంచన లేకుండా పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేసిన తర్వాత కలెక్టరేట్ ప్రాంగణంలో శ్రీనివాసుల నాయుడు మీడియాతో మాట్లాడారు. గతంలో తాను ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో కీలకంగా పని చేశానన్నారు. తనకు పలు ఉపాధ్యాయుల సంఘాల మద్దతు ఉందని తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ, మిత్ర సంఘాలు ఏపీటీఎఫ్ 1938, ఏపీ యూఎస్, ఎస్టీయూ, ఏపీటీడబ్ల్యూటీఏ, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, పీఈటీ అసోసియేషన్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏపీటీఏ), గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్, కాంట్రాక్ట్ డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్, జూనియర్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్‌లు శ్రీనివాసులు నాయుడుకు మద్దతు ప్రకటించాయి. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్ట కృష్ణయ్య, ఏఎం గిరిప్రసాద్ రెడ్డి, రాష్ట్రస్థాయి నాయకుడు వైష్ణవ కరుణానిధి, ఏపీటీఏఫ్(1938) రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎస్టీయూ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఇమంది పైడిరాజు పాల్గొనగా.. పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా కన్వీనర్ డి.గోపీనాథ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు పి.వి.ఎన్.మాధవ్ సమావేశంలో పాల్గొని.. రాజకీయాలకు అతీతంగా.. ఉపాధ్యాయుల సమస్యలపై పట్టు ఉన్న గాదె శ్రీనివాసుల నాయుడును ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఆరు జిల్లాలకు సంబంధించిన అన్ని సంఘాల అధ్యక్ష కార్యదర్శులు హాజరయ్యారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని నోడల్ అధికారులను కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. నామినేషన్లు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వసతుల కల్పన, జాబితాల తయారీ, సిబ్బంది కేటాయింపు, వివిధ రకాల విధుల నిర్వహణ తదితర అంశాలపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని, అనుమతుల జారీ విషయంలో సింగిల్ విండో విధానం పాటించాలని సూచించారు. ఆయా నోడల్ అధికారులు ఇప్పటి వరకు చేపట్టిన చర్యల గురించి ఆరా తీసిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, నోడల్ అధికారులు,పోలీసు అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడు

ఎమ్మెల్సీ స్థానానికి ఐదో రోజు నాలుగు నామినేషన్లు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి శుక్రవారం మరో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటి వరకు దాఖలైన నామినేషన్ల సంఖ్య 8కి చేరింది. పీఆర్టీయూ మద్దతుతో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, స్వతంత్ర అభ్యర్థులు సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ బహుజన ఫోరం అభ్యర్థి పోతల దుర్గారావు తమ మద్దతుదారులతో కలిసి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో కలెక్టర్ ప్రమాణం చేయించారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియకు గడువు కాగా.. ఇప్పటికే ఐదు రోజులు గడిచిపోయింది. రెండో శనివారం, ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఒక్క రోజే ఇంకా నామినేషన్లు వేయడానికి గడువు ఉంది. ఇప్పటివరకు 8 నామినేషన్లు దాఖలవ్వగా అభ్యర్థులు 14 సెట్లు సమర్పించారు. ఏఆర్వో, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, నోడల్ అధికారి, వీఎంఆర్డీఏ ఎస్టేట్ అధికారి దయానిధి పాల్గొన్నారు.

మండు వేసవిలో చల్లని అనుభూతి

పోర్ట్ స్టేడియంలో స్నో స్టేషన్ ప్రారంభం



జారుడు బల్లపై బాలిక సందడి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న పోర్ట్ చైర్మన్ అంగముత్తు

విశాఖ స్పోర్ట్స్: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి నీటిలో ఆటలాడటం సహజం. కానీ మండుటెండల్లో మంచుతో ఆడుకునే అవకాశం వస్తే ఎలా ఉంటుంది? విశాఖ వాసులకు సరిగ్గా అలాంటి అద్భుత అనుభూతిని అందించడానికి నగరం నడిబొడ్డున, పోర్టు స్టేడియంలో 'స్నో స్టేషన్' పేరుతో సరికొత్త మంచు వినోద కేంద్రం రూపుదిద్దుకుంది. దేశంలోని కొన్ని నగరాల్లో ఇలాంటి కేంద్రాలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలో మాత్రం ఇదే మొదటిది కావడం విశేషం. సుమారు 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ స్నో స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో 12 అడుగుల మందంతో మంచును పరచగా, మొత్తం నిర్మాణం 35 అడుగుల ఎత్తులో ఉంటుంది. కళా దర్శకుడు రవి (దసరా సినిమా ఫేం) ఈ స్నో స్టేషన్ లోపలి భాగాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. సందర్శకులు మంచుపై బాల్ గేమ్స్ ఆడటమే కాకుండా, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంచు వాలుపై జారిపోతూ సరికొత్త అనుభూతిని పొందవచ్చు. ఈ స్నో స్టేషన్‌లో ప్రవేశం పెద్దలకు ఒక్కొక్కరికి రూ.799, పిల్లలకు రూ. 649గా టికెట్ ధర నిర్ణయించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉండే ఈ వినోద కేంద్రంలో గంట సమయం చొప్పున స్లాట్లు కేటాయించారు. లోపలి చలి వాతావరణాన్ని తట్టుకోవడానికి చేతి గ్లోవ్స్, బూట్లు వంటివి నిర్వాహకులే అందిస్తారు. ఒక్కసారి లోపలికి వెళ్తే చాలు గంటసేపు చల్లటి వాతావరణంలో సరదాగా గడపవచ్చు. కాగా.. విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్నో స్టేషన్‌ను విశాఖ పోర్ట్ అథారిటీ చైర్మన్ మాధయ్యన్ అంగముత్తు శుక్రవారం ప్రారంభించారు

300 మందికి ఉపాధి

విశాఖ పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. పర్యాటకులను ఆకర్షించేందుకు మరో హంగుగా స్నో స్టేషన్‌ను ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోనే ఇది మొదటి మంచు స్టేషన్. పోర్ట్ స్టేడియంలో విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ఆటలతో పాటు అడ్వెంచర్ యాక్టివిటీస్‌ను ఏర్పాటు చేశాం. ఇక్కడ గో కార్ట్ ట్రాక్ కూడా ఉంది. ఎక్కడెక్కడి నుంచో వచ్చే సందర్శకులకు ఇది ఒక వినోద గమ్యస్థానంగా తీర్చిదిద్దాం. దాదాపు 300 మందికి ఉపాధి కల్పిస్తున్నాం.

– కె.ప్రమోద్, ఎండీ, స్నో స్టేషన్

నీవే స్ఫూర్తి.. యువతకు చైతన్య దీప్తి

కనులపండువగా వివేకానందుని శోభాయాత్ర



ర్యాలీలో పాల్గొన్న వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు

ఏయూక్యాంపస్/దాబాగార్డెన్స్: భారతీయ ఆధ్యాత్మిక శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వివేకానంద స్వామి నేటి తరానికి నిజమైన స్ఫూర్తిగా నిలుస్తారు. వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో శోభాయాత్ర జరిగింది. ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద ప్రారంభమైన ఈ యాత్ర బీచ్‌రోడ్డులోని రామకృష్ణ మిషన్ వరకు సాగింది. ముందుగా ఈ యాత్రను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. వివేకానందుని స్ఫూర్తితో యువతరం ఉన్నతంగా రాణించాలని పిలుపునిచ్చారు. పెద్ద సంఖ్యలో యువత ఈ యాత్రలో పాల్గొనగా.. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వివేకానందుని విగ్రహానికి పూలమాలలు, పుష్పాలు అర్పించారు. పలువురు విద్యార్థులు వివేకానందుడు, భారతమాత వేషధారణలో ర్యాలీలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివేకానందుడి సూక్తులతో కూడిన ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. నిలువెత్తు వివేకానందుని విగ్రహంతో యువత ఫొటోలు తీసుకోవడానికి ఆసక్తి చూపారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు, రామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వామి స్వసమవేద్యానంద, రామకృష్ణ మిషన్ స్వామీజీ గీతాసకరానంద, ఎం.సత్యనారాయణ రాజు, ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తదితరులు పాల్గొన్నారు.



స్ఫూర్తి ప్రదాతతో ఎన్‌సీసీ క్యాడెట్ల సెల్ఫీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: కుంభమేళాకు మరిన్ని ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖపట్నం–గోరఖ్‌పూర్(08588) స్పెషల్ ఈ నెల 10, 22వ తేదీల్లో రాత్రి 10.20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరుతుంది. ఈ నెల 12, 24వ తేదీల్లో రాత్రి 7.30 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. గోరఖ్‌పూర్–విశాఖపట్నం(08587) స్పెషల్ ఈ నెల 13, 25వ తేదీల్లో సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరి 15, 27వ తేదీల్లో మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు 4–సెకండ్ ఏసీ, 3–థర్డ్ ఏసీ ఎకానమీ, 8–స్లీపర్ క్లాస్, 4–జనరల్, 1–సెకండ్ క్లాస్ కం లగేజీ/దివ్యాంగ కోచ్, 1జనరేటర్ మోటర్ కార్ కోచ్‌తో నడుస్తుంది.

మహిళా డిగ్రీ కళాశాల సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల స్వయం ప్రతిపత్తి సాధించిన తర్వాత జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో 76.34 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. 2023లో నేక్ ఏ+ గ్రేడ్ సాధించి, 2024–25 నుంచి 2033–34(పదేళ్లకు) వరకు స్వయం ప్రతిపత్తి సాధించిన కళాశాల అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నందుకు ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

నిద్రపోతున్న 'టూరిజం'

కొమ్మాది: అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌లో అడుగడుగునా పర్యాటక శాఖ నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈ బీచ్‌ను నిర్వహణను అధికారులు, సిబ్బంది గాలికొదిలేశారు. మరోవైపు బోటు షికారు, సీ వ్యూ పాయింట్ వద్ద టికెట్ దందాలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తూతూమంత్రంగా ఎవరో ఒక ప్రైవేట్ సిబ్బందిపై చర్యలు తీసుకుని మమ అనిపించేస్తున్నారు. ఇక్కడ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న రజిత్ వ్యవహారశైలిపై అధికారులకు పలు ఫిర్యాదులు అందినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఆయన కింద పనిచేసే సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఈ చిత్రమే సాక్ష్యం. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ కొంతమంది జూనియర్, సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. టూరిజం బోట్ల నిర్వహణ ఎలా ఉంది? టికెట్ కౌంటర్, కంట్రోల్ రూమ్ వద్ద పరిస్థితిని గమనించి ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం అందివ్వాలి. కానీ వీరు మాత్రం వచ్చామా.. తిన్నామా.. పడుకున్నామా... వెళ్లిపోయామా అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. విధులు మరిచి చల్లటి గాలికి హాయిగా నిద్ర పోతున్నారు. దీనిపై టూరిజం డివిజనల్ మేనేజర్ జగదీష్‌ను వివరణ కోరగా ఇలాంటి పునరావృత్తం కాకుండా కఠినమైన చర్యలు తీసుకుంటామని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే క్షమించేది లేదని స్పష్టం చేశారు.



కంట్రోల్ రూమ్‌లో నిద్రపోతున్న జూనియర్ అసిస్టెంట్ తౌటి నాయుడు

పీడీఎస్ బియ్యం పట్టివేత

సీతమ్మధార: రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కానవరపు వినయ్ శుక్రవారం రేషన్ లబ్ధిదారుల నుంచి పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తున్నాడు. ఈ సమాచారం అందడంతో పోలీసులు అక్కయ్యపాలెం క్రాస్ బేకరీ సమీపంలో అతన్ని పట్టుకున్నారు. ఆటోలో తరలిస్తున్న 1,196 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వినయ్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

యూసీడీ పీడీగా సత్యవేణి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పీఎం సత్యవేణిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ప్రస్తుతం జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

కళాశాల బస్సు ఢీకొని కూలీ దుర్మరణం

పద్మనాభం: నేరెళ్లవలస పంచాయతీ విజయానందపురం జంక్షన్‌కు సమీపంలో సారిక వారి కళ్లాల వద్ద శుక్రవారం ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొని కూలీ దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. పద్మనాభం మండలం పొట్నూరు గ్రామానికి చెందిన పల్లా పరదేశి(47) విజయనగరం బీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. విజయనగరం నుంచి పరదేశి, అతని తమ్ముడు బంగారయ్య శుక్రవారం వేర్వేరు సైకిళ్లపై తమ సొంతూరు పొట్నూరుకు వస్తున్నారు. మార్గమధ్యలో సారిక వారి కళ్లాల వద్దకు రాగానే వెనుకనే వస్తున్న ఆనందపురం మండలం గిడిజాల సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన బస్సు పరదేశిని ఢీకొట్టి పది మీటర్ల దూరం ఈడ్చుకుంటూ పోయింది. ఈ దుర్ఘటనలో పరదేశి కుడికాలి తొడ ఎముక విరిగిపోయింది. కుడి చేతికి బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆయన ఘటనా స్థలిలోనే మృతి చెందాడు. అతని భార్య బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరిపోయిన ఇంటి దీపం

ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో పరదేశి కుటుంబం రోడ్డున పడింది. పరదేశికి భార్య బుజ్జి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె హేమ బీఎస్సీ నర్సింగ్ చదువుతుండగా, రెండో కుమార్తె మౌనిక 9వ తరగతి చదువుతోంది. అతను నేరెళ్లవలసలోని జ్యూట్ మిల్లులో కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇద్దరు కుమార్తెలను చదివిస్తున్నారు. ఇంటికి పెద్ద దిక్కైన పరదేశిని బస్సు రూపంలో మృత్యువు కబళించడంతో కుటుంబ సభ్యులు గుండెలు అవిసేలా రోదిస్తున్నారు.



మృతదేహం వద్ద కుటుంబ సభ్యుల రోదనలు



పరదేశి (ఫైల్)

కుక్కల దాడిలో జింక మృతి

కొమ్మాది: ఇందిరా గాంధీ జూ పార్కు నుంచి తప్పించుకుని వచ్చిన జింక ఎండాడ బంగారమ్మ తల్లి గుడి దగ్గర కుక్కల దాడిలో మరణించింది. శుక్రవారం సాయంత్రం ఈ జింక ఆ ప్రాంతానికి చేరుకుంది. ఆ సమయంలో దాదాపు 10 కుక్కలు గుంపుగా జింకపై దాడి చేయడంతో అది అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని, శవ పరీక్ష నిమిత్తం జింక కళేబరాన్ని కంబాల కొండకు తరలించారు. ఇటీవల మారికవలస, ఎండాడ వద్ద రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురై రెండు జింకలు మరణించాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే జూలోని జింకలు తప్పించుకుని ఇలా జనారణ్యంలోకి వచ్చి మరణిస్తున్నాయని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మృతి చెందిన జింక

టీడీపీ నేత భూ దందా

కొండ ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


మధురవాడ: మారికవలసకు చెందిన ఓ టీడీపీ నాయకుడు అర్థ, అంగ బలాన్ని అడ్డు పెట్టుకుని చేస్తున్న అక్రమ దందాకు అడ్డూ అదుపులేకుండా లేకుండా పోతోంది. విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 179లోని మారికవలస జంక్షన్ ఆనుకుని ఉన్న వివాదాస్పద భూమిలో టీడీపీ నాయకుడు పట్టా ఉన్న దాని కంటే ఎక్కువ స్థలంలో ఇష్టానుసారంగా భవన నిర్మాణం చేస్తున్నాడు. ఆర్డీవో, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు గతంలో పరిశీలన చేసి ఇక్కడ భూమి ఆక్రమణకు గురైందని నిర్ధారించారు. పట్టాకు, అతను స్వాధీనంలో ఉన్న భూమికి వ్యత్యాసం ఉందని గుర్తించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవేమి పట్టించుకోకుండా ఆ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మాణం చేస్తున్నాడు. శుక్రవారం ఈ భవనాన్ని ఆనుకుని మరో 30 గజాల వరకు కొండ స్థలాన్ని కొందరు కూలీలను పెట్టి మరీ చదును చేసి ఆక్రమణకు ప్రయత్నం చేశాడు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో గ్రేడ్–2 వీఆర్వో పూర్ణసాయి అక్కడకు చేరుకుని కొండ ఆక్రమణ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ ఓ వ్యక్తి ప్రభుత్వ భూమి ఆక్రమణకు ప్రయత్నం చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో కొండ తవ్వకం పనులు నిలుపుదల చేయించినట్లు చెప్పారు. అతని పట్టాలో ఉన్న స్థలానికి, నిర్మాణానికి వ్యత్యాసం ఉందని గుర్తించామన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. కాగా.. వివాదాస్పద నిర్మాణానికి ఎదురుగా ఎన్నో ఏళ్లుగా ఓ పేద మహిళ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ దుకాణం తన భారీ భవనానికి అడ్డంగా ఉందని టీడీపీ నాయకుడు భావించి.. దీన్ని తొలగించేందుకు తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నాడని బాధిత మహిళ వాపోతోంది.



నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం ఇదే..

పనుల అంచనాలు రూపొందించండి

విశాఖ సిటీ: రానున్న ఆర్థిక సంవత్సరంలో ఇంజినీరింగ్ పనుల అంచనాలను సమగ్రంగా రూపొందించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో పరిపాలన, రెవెన్యూ, అలాట్‌మెంట్, సాంకేతిక, ప్రణాళిక విభాగాల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్కుల్లో రక్షణ చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు తప్పకుండా పనిచేసేలా చూడాలన్నారు. ప్రణాళిక విభాగంలో భూ వినియోగ మార్పిడి దరఖాస్తులను, సిబ్బంది వ్యక్తిగత లాగిన్‌లో ఉన్న దస్త్రాలను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. కార్యదర్శి మురళీకృష్ణ, సీతఈ భవానీశంకర్, సీయూపీ శిల్ప ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్